క్లుప్తంగా

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ఉన్న సంతోషిమాత ఆలయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, భక్తులతో క్షీరాభిషేకం, విశేష అలంకరణ, సంతోషిమాతహవనం, కుంకుమార్చన, పల్లకీసేవ, మహార్నివేదన, మహా మంగళహారతితో వార్షికోత్సవ వేడుకలు ముగించారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి



దేవరకద్ర రూరల్: అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని కౌకుంట్ల సర్పంచ్ స్వప్న అన్నారు. మంగళవారం మండలంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అందులోని చిన్నారులకు ప్రతి రోజూ అందుతున్న పోషకాలకు సంబంధించిన ఆహారంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీలి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

దేవరకద్ర రూరల్: స్థానిక ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి ఆల రఘుపతి రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో మండల నాయకులు ఆల్‌ఇన్‌వన్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జెట్టి నర్సింహ రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, బాల్‌రాజు పాల్గొన్నారు.

భరతముని జయంతి



జడ్చర్ల టౌన్: భరతముని జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సంస్కార భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు కళలపై అవగాహన కల్పించారు. భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో వాటి ప్రాముఖ్యతను తెలిపారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్కారభారతి సభ్యులు రాధాకృష్ణ, రమేష్‌జీ, బాలమణి, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయండి

బాలానగర్: ఈనెల 15న జరిగే సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని గిరిజన ముద్దుబిడ్డలందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ వాల్యానాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దాయపల్లి ముఖ్య కూడలిలో నిర్మించ తలపెట్టిన సేవాలాల్ ఆలయ నిర్మాణం, జయంతి ఉత్సవాల కోసం జయంతి రోజున గిరిజనులతో భారీ ర్యాలీ నిర్వహించి ఐక్యత చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు ఇచ్చిన నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్‌నాయక్, పెద్దాయపల్లి ఎంపీటీసీ స్నేహలత, నాయకులు నాంగేందర్, ఆర్‌కే రమేష్, లింగునాయక్, శ్రీను, బాలునాయక్, భాస్కర్ నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి గాయాలు

గండేడ్: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సల్కర్‌పేట్‌కు చెందిన కృష్ణ, శంకర్ దిక్రవాహనంపై గండేడ్‌కు బయలుదేరారు. అదే సమయంలో కోస్గికి చెందిన భరత్, ప్రదీప్‌లు కోస్గి వైపునకు వెళ్తుండగా, రెడ్డిపల్లి పెట్రోల్‌బంక్ వద్ద ప్రమాదవశాత్తు రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సంఘటనలో నాలుగురికి గాయాలు అయ్యాయి. వారిని 108 వాహనంలో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బాలానగర్: మండలంలోని ఉడిత్యాలకు చెందిన మూడు వార్గాల వారు భూ తగాదాలతో గొడవపడి పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. మూడు వర్గాలవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపారు.

అసంపూర్తి పనులు పూర్తయ్యేనా?



దుమ్ముతో కనిపించకుండా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

- నిలిచిన సంతబజారు రోడ్డు నిర్మాణం
- దుమ్ము, ధూళితో ఇబ్బందులు

బాలానగర్: మండల కేంద్రంలో సంత జరిగే ప్రధాన రహదారిలో రోడ్డు పనులకు నిధులు మంజూరై శంకుస్థాపన చేసి నాలుగేళ్లు గడిచింది. అయినా నిర్మాణ పనులు పూర్తి కాలేదు. సంతబజారులో భారీ వాహనాల రాకపోకలతో తీవ్ర దుమ్ము, ధూళితో ప్రజలు, అధికారులు, దుకాణదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్వాసకోస వ్యాధులబారిన పడుతున్నామని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి–44 నుంచి రైల్వే ట్రాక్ వరకు, భవాని కాలనీ నుంచి జాతీయ రహదారి వరకు, సంతబజారు రోడ్డు, బైపాస్ రోడ్డులో బ్రిడ్జి, బాలానగర్ ముఖ్య కూడలి జాతీయ రహదారి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అప్పట్లో నిధులు మంజూరు చేయించారు. రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి నాలుగేళ్లు గడిచినా సదరు కాంట్రాక్టర్ నేటికి పనులను పూర్తి చేయలేదు. దీంతో నిత్యం దుమ్ముతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పనులు చేపడుతాం..



రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. సమస్య ఇది వరకు తమ దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– హలీం, పీఆర్ ఏఈ, బాలానగర్

దుమ్ముతో ఇబ్బందులు..



మండల కేంద్రంలో ప్రధాన మార్గమైన రోడ్డు దుమ్ము, ధూళితో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. స్థానికంగా వ్యాపారాలు చేసుకునే వారు, కార్యాలయాల్లో పనిచేస్తున్న వారు, ప్రజలకు శ్వాస సంబంధిత సమస్యలు వస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– శేఖర్, బాలానగర్

సమావేశంలో ప్రస్తావించాం..



రోడ్డు నిర్మాణానికి మండల సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించాం. కరోనా కారణంగా, నిధుల జాప్యంతో పనుల్లో ఆలస్యమైంది. త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేసేలా అధికారులతో, కాంట్రాక్టర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

– కమల, ఎంపీపీ, బాలానగర్

రమాబాయికి ఘన నివాళి



జిల్లా కేంద్రంలో రమాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతపాలమూరు జై భీమ్ చౌరస్తాలో బహుజన మహాసీయుల శోభయాత్ర కమిటీ ఆధ్వర్యంలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ దేశం కోసం అంబేడ్కర్ చేసిన సేవల్లో రమాబాయి పాత్ర కూడా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు రాములు, సింగిరెడ్డి పరమేశ్వర్, రాయికంటి రాందాస్, రమేష్, ప్రవీణ్‌కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో..

రమాబాయి జయంతిని తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం కార్యాలయంలో రమాబాయి చిత్రపటానికి రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, నాయకులు రాఘవేందర్, లక్ష్మయ్య, వెంకటేష్, శ్యాంసుందర్, శివకుమార్, కతలయ్య తదితరులు పాల్గొన్నారు.



గండేడ్‌లో..

గండేడ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి మహిళలకు ఆదర్శమని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రమాబాయి జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక చౌరస్తాలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముశ్రీఫా, ఆశన్న, కృష్ణయ్య, శ్రీనివాస్, నరేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా అశోక్‌కుమార్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వ్యవసాయ శాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అశోక్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రతాప్, కార్యదర్శిగా ఎండీ ఖాన్, కోశాధికారిగా మహమూద్, వైస్ ప్రెసిడెంట్లుగా ఆశీష్, పెంటమ్మ, జాయింట్ సెక్రటరీగా మథీన్, మంగమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యాదయ్య, పబ్లిసిటీ కార్యదర్శిగా అశోక్, సభ్యులుగా శ్రీనివాస్, హేమలత ఎన్నికయ్యారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, రామకృష్ణ, షౌకత్, ప్రవీణ్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కుమ్మరివాడిలో మంగళవారం 7నుంచి పదో తరగతి విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అంతీరామ్ నాయక్ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు ఆత్మరక్షణ, శారీరక ధృడత్వానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు కరాటే నేర్చుకొని జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలని కోరారు. శ్రీహనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, శ్రీనివాసులు, రాములు, రఘు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



నవాబుపేట: మండలంలోని జంగమయ్యపల్లిలో మంగళవారం సీసీ రోడ్డు పనులను పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు ప్రారంభించారు. జాతీయ ఉపాధి పథకంలో గ్రామానికి మంజూరైన రూ.10లక్షల సీసీ రోడ్డు పనులను సర్పంచ్ వెంకటేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో రైతుబంధు మండల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, కృష్ణగౌడ్, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండలంలోని కొలిమికుచ్చ తండాలో మంగళవారం సీసీరోడ్డు పనులను జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎమ్మెల్యే నిధుల నుంచి వేస్తున్న సీసీరోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భిక్షపతి పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘం నాయకులు

చిన్నచింతకుంట: దళిత క్రైస్తవులపై కొనసాగుతున్న దాడులను అరికట్టాలని ఉమ్మడి పాలమూర్ జిల్లా దళిత క్రైస్తవ సంఘం అధ్యక్షుడు జీజీ పాల్ డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నచింతకుంట నుంచి ఆత్మకూర్ పట్టణం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీ పాల్ మాట్లాడుతూ మత మార్పిడిని సాకుగా చూపిస్తూ కొందరు మతోన్మాదులు దళితులపై దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు దళిత క్రైస్తవ సమాజం దాడులకు గురికాకుండా రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో దళిత క్రైస్తవ సంఘం నాయకులు శేఖర్, ఎర్రన్న, దావిద్, సామేల్, అంజన్న, సోలమన్, సాగర్, శ్రీకాంత్, యాకూబ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌షిప్‌లలో సమస్యలు రానీయొద్దు



అమిస్తాపూర్‌లోని సారిక టౌన్‌షిప్‌లో ఇళ్ల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

భూత్పూర్: సారిక టౌన్‌షిప్, పోతుల మడుగు టౌన్‌షిప్ లే–అవుట్లు పరిశుభ్రంగా ఉంచడంతో సమస్యలు రానీయొద్దని కలెక్టర్ జి.రవినాయక్ అన్నారు. మంగళవారం ఆయన భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సారిక టౌన్‌షిప్‌ను, అదేవిధంగా భూత్పూర్ మండలం పోతులమడుగు వద్ద ఉన్న పోతులమడుగు టౌన్‌షిప్‌ను సందర్శించారు. రెండు టౌన్‌షిప్‌లలో ఏర్పాటు చేసిన ప్లాట్లు, ఇప్పటి వరకు ప్లాట్లకు నిర్వహించిన వేలం, మిగిలిపోయిన ప్లాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగిలిపోయిన ప్లాట్లలో చెత్తచెదారం లేకుండా శుభ్రంగా ఉంచడమే కాకుండా, టౌన్‌షిప్ మొత్తం శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ తనిఖీ చేసి ఎక్కడైనా లీకేజీలున్నట్లయితే వాటిని అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్, హౌసింగ్ ఈఈ భాస్కర్, తహసీల్దార్ చెన్నకిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2022–23 ఉత్తమ యువజన సంఘం అవార్డు స్వామి వివేకానంద సేవా సంస్థకు దక్కింది. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో సంఘం అధ్యక్షుడు శివకుమార్‌కు కలెక్టర్ అవార్డును అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌వైకే ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కోటానాయక్ పాల్గొన్నారు.

మైథిలికి అభినందన..

రాజాపూర్: జనవరి 30న గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైన్స్‌సిటీలో జరిగిన 30 జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో మండల కేంద్రంలోని అగస్త్య విద్యాలయ విద్యార్థిని డి.మైథిలి బాటిల్‌బ్రిక్ అంశంలో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ రవినాయక్ మైథిలిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, అగస్త్య విద్యాలయ కరస్పాండెంట్ నరేందర్, గైడ్ టీచర్ రాజ్‌కుమార్, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సముచిత గౌరవం



నవాబుపేట: సీనియర్ సిటిజన్లు తమ కుటుంబాల కోసం జీవితాలను ధారపోసి పోషిస్తే రిటైర్మెంట్ అనంతరం వారికి సముచిత స్థానం లభించటం లేదని సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల సీనియర్ సిటిజన్ ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగి పదవీ విరమణ పొందిన అనంతరం వారికి చాలా సమస్యలు వచ్చి పడుతున్నాయని, అందుకే 2007 చట్టం ప్రకారం సీనియర్ సిటిజన్లకు చట్టపరమైన హక్కులు కల్పించారన్నారు. మండల సిటిజన్ ఫోరం వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించి దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు ఎల్లారెడ్డి, నాగభుషణం, భర్మని విజయ్‌కుమార్, చంద్రశేఖర్, చిన్నస్వామి, వెంకటేశ్వరప్ప, వెంకటయ్య, శారదమ్మ పాల్గొన్నారు.

కూలీ డబ్బుల కోసం రైతువేదికకు తాళం



కోడూర్ గ్రామ రైతువేదిక భవనానికి తాళం వేసి పెట్రోల్ బాటిళ్లతో కూర్చున్న మేస్త్రీ, కూలీలు

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వం రైతుల సంక్షేమం.. ప్రయోజనార్థం మండలంలోని కోడూర్ శివారులో నిర్మించిన రైతువేదిక వద్ద మంగళవారం వేదికను నిర్మించిన కూలీలతో పాటు మేస్త్రీ హల్‌చల్ చేశారు. 2021 సంవత్సరం నిర్మాణం పూర్తయినా ఇప్పటి వరకు సంబంధిత కాంట్రాక్టర్ రూ.93వేలు కూలీ డబ్బులు చెల్లించకపోవడంతో మేస్త్రీ రైతువేదిక భవనానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా తాము ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని మేస్త్రీ కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, అప్పుడే రైతువేదిక వద్దకు వచ్చిన ఏఈఓ నాగార్జున పరిస్థితిని గమనించి గ్రామ పెద్దలకు విషయం తెలిపారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి వేదికకు వేసిన తాళం తీయించారు. అదే సందర్భంలో బాధితులకు అండగా కోడూర్ గ్రామ బీజేపీ ఎంపీటీసీ సభ్యుడు రాజుగౌడ్ మాట్లాడుతుండగా, వేదికలోపలి నుంచి బయటకు వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు ఆయనతో వాగ్వివాదానికి దిగారు. అంతలోనే పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి గొడవను సద్దుమణిగించారు. కాగా, రైతువేదికకు తాళం వేసి తన విధులకు మేస్త్రీ కృష్ణయ్య ఆటంకం కలిగించాడని ఏఈఓ నాగార్జున పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను సన్మానించిన జహంగీర్‌పాష ఖాద్రీ

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో ఈనెల 9నుంచి 12వరకు జరిగే మొదటి ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ (సీఎం కప్)కు కింగ్ షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ఎంపికైనట్లు ఫౌండర్, సీనియర్ మాస్టర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులను జహంగీర్‌పాష ఖాద్రీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో క్లబ్‌కు చెందిన పది మంది విద్యార్థులు ఆయా విభాగాల్లో పోటీపడుతున్నట్లు తెలిపారు. అండర్–17లో ఉజేఫ్ షరీఫ్ (బ్రౌన్ బెల్టు), అండర్–14లో మహ్మద్ అమాన్‌ఖాన్ (బ్రౌన్), ఆది నవీన్‌కుమార్ (బ్రౌన్), అండర్–15లో అజయ్‌కుమార్ (గ్రీన్), మహ్మద్ బాలే షరీఫ్ (బ్లూ), మారియ బేగం (వైట్), అండర్–13లో సాయి ప్రణీత్‌కుమార్ (ఆరెంజ్), షేక్ అర్సలాన్ (ఎల్లో), అండర్–12 విభాగంలో మహ్మద్ సాబేర్ పాష (బ్లూ), మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్ (ఎల్లో) పాల్గొంటారని తెలిపారు. వీరిలో ఉజేఫ్ షరీఫ్, అమాన్‌ఖాన్‌లు కటాస్, కుమితే విభాగాలో పాల్గొంటారని, మిగతా విద్యార్థులు కటాస్‌లో పోటీపడుతారని తెలిపారు. జాతీయస్థాయి కరాటే పోటీలకు వెళ్తున్న విద్యార్థులను కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ప్రతినిధులు అభినందించారు. జాతీయస్థాయి కరాటే పోటీల్లో కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



కర్వెనలో వరిపంటను పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేష్

భూత్పూర్: రైతులు పొలానికి సరిపడా ఎరువులు మాత్రమే వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని కర్వెనలో వరి పంటలను ఏడీఏ యశ్వంత్ రావు, మండల వ్యవసాయాధికారి మురళీధర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం రైతువేదికలో రైతులను ఉద్దేశించి జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ మాట్లాడారు. వరిలో కాండం తొలుచు, ఆకు ముడత పురుగు గుర్తించినట్లు తెలిపారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరాకు 8కిలోల 3జీ గుళికలను చల్లి, పొలంలో నీటిని తొలగించాలని సూచించారు. ఆకు ముడత పురుగు నివారణకు ఎకరాకు కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు వాడాలన్నారు. చలి తీవ్రత దృష్టిలో ఉంచుకొని రాత్రి వేళలో వరి పంటలో నీరు తొలగించాలని, పైపాటుగా పొటాష్ ఎకరాకు గాను 15కిలోల చొప్పున వేయాలని, ఎకరాకు యూరియా కేవలం 25 కిలోలు మాత్రమే వాడాలని, డీఏపీ ఎరువులు వాడరాదని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ హన్మంతు, రైతులు మాధవరెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జింక్‌లోపంతో దిగుబడి తగ్గుముఖం..

రాజాపూర్: యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన వరిలో ఎక్కువగా జింక్‌లోపంతో పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి నరెందర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఈద్గాన్‌పల్లి, తిర్మలాపూర్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధిక దిగుబడి రకాలు, సంకర రకాలు వేయడం వల్ల తక్కువ కాలపరిమితి రకాలతో సంవత్సరంలో 3 నుంచి 4పంటలు పండిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఆంజనేయులు, మేఘనాథ్, రైతులు రమేష్, నర్సింహులు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'తో పేదలకు మేలు



చౌదర్‌పల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: అంధత్వం బారిన ఎవరూ పడకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగుతో పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లిలో రెండో విడతలో భాగంగా జరుగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వం ఉచితంగా అందజేసే కళ్లజోళ్లను పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధాశ్రీ, సర్పంచ్ శంకరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు కంటి పరీక్షలు..

పాలమూరు: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా జైలులో ఖైదీలకు కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. జైలులో మొత్తం 169 మందికి కంటి వెలుగు పరీక్షలు నిర్వహించి 52మంది ఖైదీలు కంటి చూపు సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. 31మందికి అక్కడే రీడింగ్ అద్దాలు పంపిణీ చేశారు. మరో 21మంది ఖైదీలకు కంటికి సంబంధించిన మందులు అందించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశం, జైలర్ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేయించి అద్దాలు ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వార్డులో ప్రతి ఒక్కరికీ సమాచారం అందించి శిబిరానికి వచ్చేలా చూడాలని వైద్య, అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అర్బన్‌హెల్త్ సెంటర్ డాక్టర్ శివకాంత్ పాల్గొన్నారు.

శిబిరాన్ని పరిశీలించిన అధికారులు..

మిడ్జిల్: మండలంలోని మల్లాపూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ పరిశీలించారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగారెడ్డి, డాక్టర్లు మనుప్రియ, కృష్ణకుమార్, సిబ్బంది జంగయ్య, దేవయ్య, తిరుపతమ్మ, పారిజాత తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ఖైదీలకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు



జడ్చర్లలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి